రంగనాథుడి దర్శనం.. భక్తుల పరవశం

- 400 ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణం
- 17న ప్రారంభమైన ధనుర్మాస వేడుకలు
- వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు షురూ


జియాగూడ: జియాగూడలోని చారిత్రాత్మకమైన శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవానికి ఏర్పాట్లు, అలంకరణలు ప్రారంభమయ్యాయి. ఈ ఆలయం 400 సంవత్సరాల పురాతనమైనది. ఈ ఆలయం శ్రీరంగం పోలిన ఆకారంలో రంగనాథస్వామి కొలువుదీరి ఉన్నారు. కోరిన కోరికలు తీర్చే స్వామిగా పేరుగాంచిన ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతాయి. నగరం నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రతి సంవత్సరం ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. వైకుంఠ ఏకాదశి ఈనెల 23న పురస్కరించుకుని ఈ ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

నాటి జైనుల ఇలవేల్పుగా..

గోల్కొండ రాజుల పరిపాలన కాలంలో కోటలో వజ్రాలు, వైడుర్యాలు రూపుదిద్దుకున్న తర్వాత కార్వాన్‌లో రాసులు పోసి అమ్మేవారు. ఈ వ్యాపారం జైన్ మతస్థులు నిర్వహించేవారు. వీరంతా శ్రీరంగంలోని శ్రీ రంగనాథస్వామి భక్తులు కాగా అక్కడకు వెళ్లలేని వృద్ధులు చేరువలో ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించి మూసీనది ఒడ్డున జియాగూడ ప్రాంతాన్ని ఎంచుకుని ఆలయాన్ని వాస్తురీతిలో నిర్మించారు. ఈ ఆలయం పూర్తిస్థాయిలో వాస్తు ఆలయంగా ఖ్యాతి గాంచింది. నాటి నుంచి భక్తుల కొంగు బంగారంగా మారడంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆలయంలో రంగనాథ స్వామి భూదేవి శ్రీదేవి, నమ్మాళ్వార్, నవగ్రహ, ఆంజనేయ, పుష్కరిణి తదితరవి నెలకొని ఉన్నాయి.



వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనానికి సిద్ధమైన జియాగూడ రంగనాథస్వామి దేవస్థానం



శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి

వానమామలై వైష్ణవ జీయార్ స్వామి ఆలయంగా ఖ్యాతి..

వానమామలై వైష్ణవ జీయార్ స్వామి ఖ్యాతిగాంచింది. 30 ఏళ్ల నుంచి రంగనాథస్వామి ఆలయంలో వైకుంఠ ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. చిన్న తిరుపతిగా రంగనాథస్వామి ఆలయం పేరుగాంచింది. ప్రధాన రహదారిపై 14 వైకుంఠ ద్వారాలతో రంగనాథస్వామి దర్శనం భక్తులను అలరించనుంది.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తాం..



ప్రతిష్టాత్మకమైన జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ద్వారదర్శన వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం. తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాం. వైకుంఠ ద్వార దర్శనం తెల్లవారుజామున జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో కూడా దర్శనం భక్తులకు అందిస్తున్నాం.

– ఆలయ ప్రతినిధి శేషాచార్యులు

170 ఏళ్లుగా శృంగారం వారి వారసుల నేతృత్వంలో..

రంగనాథస్వామి ఆలయంలో 170 ఏళ్ల నుంచి శృంగారం వంశస్థులు పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. వైకుంఠ ఏకాదశి, ధనుర్మాస ఉత్సవాలు ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యాయి. అని ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఎస్టీ చారి, ప్రతినిధి శేషాచార్యులు, ప్రధాన అర్చకులు రాజగోపాలచార్యులు తెలిపారు. కాగా ఆలయంలో ఇప్పటికే ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ సారి వైకుంఠ ద్వార దర్శనం వినూత్న శైలీలో భక్తులకు లభించనుందని తెలిపారు.

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఆహ్వానం



చార్మినార్: చార్మినార్ చౌక్ మైదాన్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 23న వైభవంగా నిర్వహించే ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి ఆలయ ప్రధాన పూజారి శృంగారం ఆత్రేయాచార్యులు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈనెల 23 నుంచి జనవరి 16వ తేదీ వరకు ఉత్సవాలు జరుగనున్న విషయాన్ని ఆయనకు వివరించి హాజరు కావాలని కోరినట్లు తెలిపారు.

మహబూబియాలో క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ చిన్నారులతో కలిసి క్రిస్మస్ వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందని గోద్రేజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి అన్నారు. గురువారం గన్‌ఫౌండ్రీలోని మహబూబియా బాలికల ఉన్నత పాఠశాలలో గోద్రేజ్ జెర్సీ, రెడీ టూ కుక్ స్నాక్స్ బ్రాండ్ ఆధ్వర్యంలో వన్ విష్ ఎట్ ఏ టైమ్ పేరిట క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాయ్ ఆఫ్ గివింగ్ నెలను పురస్కరించుకుని విద్యార్థులకు స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చిన్నారుల కళ్లల్లో ఆనందం తన మనస్సుకు ఎంతగానో హత్తుకుందన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు ఆత్మరక్షణపై ప్రత్యేక శిబిరం



అబిడ్స్: మహిళా ఉపాధ్యాయులకు ఆత్మరక్షణపై ప్రత్యేక శిబిరం నిర్వహించారు. రోనాల్డ్ రీగన్ ఆగాఖాన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న డైమండ్ జూబ్లీ ఉన్నత పాఠశాల మహిళా ఉద్యోగులకు ఆత్మరక్షణ ఎలా చేసుకోవాలో నిర్వహించారు. 2వ రోజు గురువారం పాఠశాలలో ఆకేసి అంతర్జాతీయ సంస్థతో ఈ శిబిరం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుజాత గాడే మాట్లాడుతూ..తమ మహిళా ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలకు మానసిక శ్రేయస్సుతో పాటు శారీరక భద్రత, ఆత్మరక్షణ కూడా ఎంతో అవసరమన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా పలు రంగాల్లో అవగాహన కలిగే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

ఆహార పదార్థాల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి



అయ్యప్ప స్వాములకు ఆహార పదార్థాలను అందజేస్తున్న గాజుల అంజయ్య

చార్మినార్: అయ్యప్ప దీక్షలో ఉంటున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు, చిరు వ్యాపారులు వంట చేసుకోవడానికి సమయం లేనందున భిక్ష కోసం ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఉచితంగా ఆహార పదార్థాలను అందజేస్తున్నామని మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం ప్రాంగణంలో అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన అయ్యప్ప భక్తులకు గురువారం ఉదయం ఆయన ఉచితంగా ఆహార పదార్థాల పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పూజల అనంతరం భక్తులకు టిఫిన్ బాక్స్‌లలో ఆహార పదార్థాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లుగా అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఉచిత ఆహార పదార్థాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అయ్యప్ప స్వాములను కోరారు. ఈ కార్యక్రమంలో చలువాది శ్రీకాంత్, సంతోష్ బేరేలీ, జే.సాయినాథ్ తదితరులున్నారు.

మంత్రి పొన్నంకు శుభాకాంక్షలు



చాంద్రాయణగుట్ట: తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో కలిసి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. బీసీలకు అన్ని రంగాల్లో న్యాయం జరిగేలా చూడాలన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు.

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి



రవీంద్రనాయక్‌ను సన్మానిస్తున్న టీవీవీపీ జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: తెలంగాణలో వైద్యుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ జేఏసీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ జేఏసీ కోర్ కమిటీ బృందం నూతనంగా నియమితులైన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో పరిష్కారం కాని సమస్యలు ఎన్నో ఉన్నాయని, దానిపై డీహెచ్‌గా రవీంద్ర నాయక్ దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వానికి తమవంతు సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సోం మల్లయ్య, చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మరియమ్మ, పాండు, పరమ కుమార్, వీరేష్ బాబు, అమృత్‌రావు, కొండల్‌రెడ్డి, భూలక్ష్మీ, శ్రీనివాస్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు



సమావేశంలో మజహర్ ఉల్లా తదితరులు

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ ఆస్పత్రుల లాంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా అన్నారు. గురువారం ఆయన తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌తో జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో జూమ్ మీటింగ్‌లో చర్చించిన విషయాలను వివరించారు. రాష్ట్రంలో కోవిడ్ కొత్త వేరియంట్‌పై జూమ్ మీటింగ్‌లో ప్రత్యేకంగా చర్చించామన్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఆయన సూచించారు. అయితే కోవిడ్ కొత్త వేరియంట్ అంత ప్రమాదకరి కాదని తెలిందన్నారు. అయినా కూడా దీని పట్ల నిర్లక్ష్యం గానీ ఉదాసీనంగా ఉండడం కానీ మంచిది కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

నిజాం కళాశాల విద్యార్థినుల మౌనదీక్ష

గన్‌ఫౌండ్రీ: తమ వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిజాం కళాశాల విద్యార్థులు మౌనదీక్షకు దిగారు. గురువారం తరగతులను బహిష్కరించి కళాశాల ప్రాగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ..70 మంది విద్యార్థులకు రెండు గదులను కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత రెండు నెలలుగా కనీస మౌలిక సదుపాయాలైన నీరు, ఆహారం లేకపోవడంతో పెద్ద ఎత్తున ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్ దృష్టికి ఎన్నోసార్లు తీసుకువెళ్లినప్పటికీ స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. తమ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని వెల్లడించారు.

కొనసాగుతున్న దత్త జయంతి ఉత్సవాలు

గౌలిపురా: లాల్‌దర్వాజాలోని దత్త సాయి మందిరంలో దత్త జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం ఆలయంలో దత్తాత్రేయునికి అభిషేకం, ప్రత్యేక పూజలు, గురుచరిత్ర పారాయణ తదితర పూజ కార్యక్రమాలను ఆలయ పూజారి దత్త ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ దత్త జయంతి ఉత్సవాలు ఈనెల 27వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

25న గోషామహల్‌లో 'వికాసిత్ భారత్'



సమావేశంలో పాండుయాదవ్, ముక్క కృష్ణాగుప్తా తదితరులు

అబిడ్స్: ఈ నెల 25న గోషామహల్ నియోజకవర్గంలో 'వికాసిత్ భారత్'కార్యక్రమం నిర్వహిస్తామని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి.పాండుయాదవ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను నియోజకవర్గ ప్రజలకు అందించేందుకే 25న నియోజకవర్గం నలుమూలలా పర్యటిస్తామన్నారు. గురువారం జరిగిన సమావేశంలో పాండుయాదవ్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో వికాసిత్ భారత్ ఇన్‌చార్జులుగా ముక్క కృష్ణాగుప్తా, నరహరిను కేటాయించామన్నారు. దేశంలో ఎన్నడు లేని విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని ప్రాంతాల ప్రజలకు పలు సంక్షేమ పథకాలను అమల్లోకి తెచ్చిందన్నారు. మురికివాడలు, బస్తీలు, అన్ని వర్గాల ప్రజలకు కేంద్రప్రభుత్వ పథకాలను అందించడమే వికాసిత్ భారత్ అని ఆయన అన్నారు.

దళిత గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న పబ్బతి కృష్ణ

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్రంలో గిరిజన పంచాయతీల మాదిరిగా దళిత గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పీవీ.రావు 18వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకృష్ణ మాట్లాడుతూ.. పీవీ రావు దళితుల అభివృద్ధి కోసం పోరాడారని గుర్తుచేశారు. 65 లక్షల పైచిలుకు గల ఎస్సీలకు దళిత గ్రామ పంచాయతీలను ప్రభుత్వం ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయించాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులను కోరారు. జనాభా ప్రాతిపదికన ఎంపీటీసీ, సర్పంచ్ స్థానిక సంస్థల సీట్లను కేటాయించాలి, నామినేటెడ్ పదవులు దళితులకు కేటాయించాలని అనే డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సంకి ప్రసాద్, జూబ్లీహిల్స్ అధ్యక్షుడు ఎ.సుధాకర్, పీఎం.వర్మ తదితరులు పాల్గొన్నారు.

పండిత వ్యవస్థను రద్దు చేయాలి



మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేసిన భాషా పండితులు

అఫ్జల్‌గంజ్: పండిత వ్యవస్థను రద్దు చేయాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం పరిషత్తు ప్రతినిధుల బృందం రాష్ట్ర అడవులు, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి తమకు న్యాయం చేయాలని కోరారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలను కూడా రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ, రాష్ట్ర కోశాధికారి వీఎస్ఎస్ శర్మ, కార్యదర్శి డాక్టర్ ఎస్ విజయ్ భాస్కర్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్ జిల్లాల బాధ్యులు హమీద్ ఖాన్, ఇస్మాయిల్, రోహిత్ కుమార్, దినకర్, ఎఫ్ ఎస్ అలీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఎరుకల కులస్తులకు న్యాయం



మాట్లాడుతున్న ఎరుకల సంఘం నాయకులు

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎరుకలకు న్యాయం జరుగుతుందని ఎరుకల సంఘం రాష్ట్ర చైర్మన్, కోచైర్మన్‌లు యాదగిరి, కురాకుల కృష్ణ అన్నారు. ఎరుకల సంఘం రాష్ట్రస్థాయి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎరుకల సంఘం నాయకులు తమతమ ప్రాంతపు సమస్యలను దృష్టికి తేవాలని కోరారు. కాంగ్రెస్ ఎరుకల సంక్షేమంపై సానుకూల వైఖరితో ఉందన్నారు. ఎరుకల అభ్యున్నతికి చేపట్టాల్సిన చర్యలు, స్వయం ఉపాధికి ఎరుక కులస్తుల కోసం ప్రత్యేక ఫండ్‌ను ఏర్పాటు చేయాలని తాము ముఖ్యమంత్రితో పాటు సంబంధిత మంత్రులను కూడా కలిసి వినతిపత్రాలు ఇస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఎస్టీ విభాగం కన్వీనర్ డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర స్థాయి సమావేశంలో పాతబస్తీ నేతలు

చార్మినార్: బహదూర్‌గూడలో జరిగిన బీఎస్పీ రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం జరిగిందని.. ఈ సమావేశానికి జాతీయ కో ఆర్డినేటర్ గౌతం రామ్ జీ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారని బీఎస్పీ చార్మినార్ ఇన్‌చార్జి మూల రాంచరణ్ దాస్ తెలిపారు. ఇటీవల ముగిసిన శాసన సభ ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం తీరు, స్థానిక ఓటర్ల రెస్పాన్స్, రాబోయే రోజుల్లో పార్టీ విధివిధానాలపై చర్చ జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బీఎస్పీ యాకుత్‌పురా ఇన్‌చార్జి బంగారి మాణిక్ రావు తదితరులు పాల్గొన్నారన్నారు.

వైద్య అధికారులకు శుభాకాంక్షల వెల్లువ



డీఎంఈ డాక్టర్ త్రివేణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఐఏఎస్ అన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ త్రివేణి, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, డీహెచ్ రవీంద్ర నాయక్‌లను గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్‌బాబు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ అశోక్, కోశాధికారి యాదయ్య, అహ్మద్‌దుల్లా ఖాన్, శంకర్, రాంచందర్, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు కేరళ ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలి



క్యాతం రాధాకృష్ణ

అబిడ్స్: శబరిమలలో అయ్యప్ప భక్తులకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల సౌకర్యాలు కల్పించాలని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ విజ్ఞప్తి చేశారు. లక్షలాది మంది అయ్యప్ప భక్తులు కొన్ని రోజులుగా అవస్థలు పడుతున్నా అక్కడి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. గురువారం ఉస్మాన్‌గంజ్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..తెలంగాణలోని పలు స్వచ్ఛంద సంస్థలు, అయ్యప్ప సేవా సంఘాలు శబరిమలలో అయ్యప్ప భక్తుల కోసం అన్నదానాలు, మంచినీటి సౌకర్యాలు చేపడుతామన్నా అనుమతులు ఇవ్వడం లేదన్నారు. అక్కడి ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలతో తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులను చిన్నచూపు చూస్తుందన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కేరళ సీఎంతో మాట్లాడి లక్షలాది మంది అయ్యప్ప భక్తులకు సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు అయ్యప్ప దర్శనం కూడా త్వరితగతిన అయ్యే విధంగా ప్రభుత్వం సకల ఏర్పాట్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల సత్తా



రెజ్లింగ్ జాతీయ పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులతో కోచ్ తదితరులు

గోల్కొండ: విద్యార్థులు రెజ్లింగ్‌లో మక్కువ చూపుతున్నారని తెలంగాణ రాష్ట్ర రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జాఫర్ పహల్వాన్ అన్నారు. జాతీయ కుస్తీ పోటీలకు వివిధ విభాగాల కోసం రెజ్లింగ్ అసోసియేషన్ వారు గురువారం కార్వాన్‌లోని సబ్జీ మండీ విరాభిమన్యు వ్యాయామశాలలో అర్హత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హత సాధించిన విద్యార్థులకు ఆయన మెడల్స్‌తో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు. గత దశాబ్ద కాలం నుంచి ప్రాథమిక తరగతుల నుంచే విద్యార్థులు రెజ్లింగ్ పట్ల ఆకర్షితులు అవుతున్నారన్నారు. కఠోర సాధన, క్రమ శిక్షణతో విద్యార్థులు రెజ్లింగ్‌లో అన్ని రకాల మెలకువలు నేర్చుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెజ్లింగ్‌ను ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇప్పించాలని తాను కోరతానని అన్నారు. బాలబాలికల విభాగంలో అండర్–19 పోటీలు ఈనెల 26న న్యూఢిల్లీలో జరుగుతాయని కట్టా శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ కార్యదర్శి కట్టా శ్రీనివాస్, కోచ్ సన్నీబాబు, పరిశీలకుడు జక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చాంద్రాయణగుట్ట: 2024–25 నూతన విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశాల కోసం అర్హత కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని హైదరాబాద్ జిల్లా సమన్వయ అధికారి వి.జయంతి ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 18 నుంచి జనవరి 6వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2023–24 అకాడమిక్ సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. గురుకుల ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించబడుతుందన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్ (వెబ్‌సైట్: http://tgcet.cgg.gov.in)లో మాత్రమే సమర్పించాలన్నారు.

కళలతో మానసిక ఒత్తిడికి చెక్

ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్



ప్రదర్శనను తిలకిస్తున్న కొడాలి సుందర్‌కుమార్

విజయనగర్‌కాలనీ: దైనందిన జీవితంలోని ఒత్తిళ్లను తగ్గించి మానసిక వికాసాన్ని పెంపొందించే శక్తి కళలకు ఉందని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. కొడాలి సుందర్‌కుమార్ తెలిపారు. సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను కళ్లకు కట్టినట్లు వివరిస్తూ మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల ప్రాంగణంలోని ఆర్ట్ గ్యాలరీలో అప్లయిడ్ ఆర్ట్స్ విద్యార్థులు ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, భ్రూణహత్యలు, లైంగిక వేధింపుల కట్టడికి కళలను సాధనంగా చేసుకుని విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆలోచింప చేస్తుందన్నారు. లింగ వివక్షతతో చిన్న పిల్లలను సైతం లైంగికంగా వేధిస్తున్న సంఘటనల నేపథ్యంలో ధైర్యం అనే ఆయుధంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. కళలతో దురాచారాలను కట్టడి చేయవచ్చని ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, పండుగలు తదితర ఇతివృత్తాలతో అప్లయిడ్ ఆర్ట్స్ విద్యార్థులు జనవరి 2023 నుంచి ఇప్పటి వరకు వారు నేర్చుకున్న అంశాలు ప్రదర్శనలో ఆకట్టుకుంటున్నాయన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కళా ప్రదర్శన దోహదపడుతుందన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ లలిత కళల కళాశాల ప్రిన్సిపల్ టి.గంగాధర్, అప్లయిడ్ ఆర్ట్స్ హెచ్‌ఓడీ విభాగాధిపతి ఎంఎల్ ఆనందరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.హరీష్‌బాబు పాల్గొన్నారు.


అర్హులందరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి



తన కార్యాలయానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఉదయం గోల్కొండ, లంగర్‌హౌస్, కార్వాన్ తదితర ప్రాంతాల నుంచి పలువురు వచ్చి ఆయనను కలిశారు. సబ్సిడీ ధరపై గ్యాస్ ఎల్‌పీజీ సిలిండర్లు, గృహలక్ష్మి తదితర పథకాలపై దరఖాస్తు చేసుకోవడానికి వారు ఎమ్మెల్యే సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పథకం ఇంకా ప్రారంభం కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఈ పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని ఆయన అన్నారు. అదే విధంగా గృహ నిర్మాణానికి మహిళలకు వర్తించే పథకంపై ఇంకా గైడ్ లైన్స్ రాలేదని అయితే వీటి దరఖాస్తు ఆన్‌లైన్ ద్వారా ఉండదని మంత్రులు స్పష్టం చేశారని ఆయన అన్నారు. ప్రజా దర్బార్‌లోనే ప్రజల మధ్యలోనే వీటి దరఖాస్తులు స్వీకరించబడుతాయని ఆయన అన్నారు. ఈనెల 28 నుంచి దరఖాస్తులు తీసుకునే ప్రక్రియ మొదలవుతుందని ఈలోపు నిబంధనల్లో సూచించిన ధ్రువ పత్రాలు సిద్ధం ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్ తదితరులున్నారు.

డిపో-1లో సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

అఫ్జల్‌గంజ్: గౌలిగూడలోని హైదరాబాద్ డిపో–1లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం డిపో మేనేజర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీస్తు జన్మదినం గురించి ప్రత్యేక గీతాలాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది స్వాతి, వరకుమారి, బీఎస్ రెడ్డి, జయంత్ కుమార్, రమేష్, చంద్రయ్య, కృష్ణయ్య, పాస్టర్ ఆర్ యెహో షువా తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల పాసులను అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: ఈనెల 22న ఎల్బీస్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలకు పార్టీలకు అతీతంగా పాస్టర్లు, బిషప్‌లు, క్రైస్తవ నాయకులకు సమానంగా అందజేయాల్సిన పాసులను ఇతరులకు ఇస్తున్నారని క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ జాతీయ నాయకులు జెరుసలేం మత్తయ్య ఆరోపించారు. క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఎండీ వెస్లి కాంతి బీఆర్ఎస్ పార్టీ వాళ్లకు గోల్డెన్, వీవీపీ పాసులను అందిస్తూ నిజమైన క్రైస్తవ నాయకులకు పాసులను నిరాకరిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కార్పొరేషన్ ఎండీ, బీఆర్ఎస్ పార్టీకి చెందిన రాయిడన్ రాఘవేందర్‌లపై గురువారం రాత్రి అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ ప్రతినిధులు పాసులు కోరగా అయిపోయినట్లు చెప్పి బీఆర్ఎస్ వాళ్లకు మాత్రం పాసులు ఇచ్చారన్నారు. దీనిపై తాము ప్రశ్నించగా తమపై తప్పుడు ఆరోపణలు చేసినట్లు తెలిపారు.